సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

శ్రీవారికి ప్రత్యేక పూజలు



శ్రీవారి వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శ్రీవారి శేషవస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకెళ్లారు. అభిషేకాల అనంతరం శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ రాజు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో గల శ్రీ పశుపతి నాథేశ్వరస్వామి ఆలయ 9వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటల నుండి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రిత్విక్‌వరణం, మండపారాధన, శతరుద్రాభిషేకం, లక్ష పుష్పార్చన, దీపాలంకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత



పుస్తకాలు అందిస్తున్న సొసైటీ ప్రతినిధులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డులోని తగరపువలస గ్రంథాలయానికి ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంటాన మోహనరావు శుక్రవారం పుస్తకాలు అందించారు. గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులను దృష్టిలో పెట్టుకుని ఆరుద్ర రచనలు, సమగ్ర ఆంధ్ర సాహిత్యం వాల్యూమ్స్ పుస్తకాలను గ్రంథాలయ అధికారి తవుడుకు అందజేశారు. మోహనరావు మాట్లాడుతూ గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్న విద్యార్థుల కోసం భవిష్యత్తులో మరిన్ని పుస్తకాలను సొసైటీ ద్వారా గ్రంథాలయానికి అందిస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: చేపలుప్పాడ యూపీహెచ్‌సీ ప్రహరీ నిర్మాణ పనులను శుక్రవారం వార్డు కార్పొరేటర్ కొండబాబు ప్రారంభించారు. రూ. 3 లక్షల వ్యయంతో ఈ ప్రహరీ నిర్మిస్తున్నామన్నారు. అదే విధంగా చిన్న ఉప్పాడలో కల్యాణ మండపం పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. రెండు శ్లాబ్‌లు పూర్తయ్యాయని, దీనిని త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రానున్నట్లు తెలిపారు.

అపరిశుభ్ర వాతావరణంలోనే చేపల విక్రయాలు

- కార్యరూపం దాల్చని ప్రత్యేక చేపల మార్కెట్
- ప్రతిపాదనలకే పరిమితం చేసిన టీడీపీ ప్రభుత్వం
- స్థల పరిశీలనతో సరిపెట్టిన మత్స్యశాఖ



తగరపువలస ప్రైవేట్ మార్కెట్‌లో అపరిశుభ్ర వాతావరణంలో చేపలు విక్రయిస్తున్న వ్యాపారులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట వద్ద ప్రత్యేక చేపల మార్కెట్, నిల్వ చేసేందుకు నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. ఇక్కడ ప్రత్యేక మార్కెట్ నిర్మాణం చేపట్టనున్నట్లు గత టీడీపీ ప్రభుత్వం ప్రకటించినా, తర్వాత పనులేవీ ముందుకు సాగలేదు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో కేవలం స్థల పరిశీలన చేసి తరువాత ప్రతిపాదనలను అటకెక్కించారు. ప్రస్తుతం ప్రైవేట్ మార్కెట్‌లో చేపలు విక్రయం జరుగుతున్న ప్రదేశం అపరిశుభ్రంగా ఉంటోందని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు.

మార్కెట్ శివారులో టాయిలెట్లను ఆనుకుని ఉన్న గలీజు వాతావరణంలోనే నేలపై చేపలను విక్రయించడం, బాగు చేయడం చేస్తుంటారు. చేపల వ్యర్థాలను కూడా అక్కడే పారబోయడంతో బ్యాక్టీరియా వృద్ధి చెంది వినియోగదారులు ముక్కు మూసుకుని మార్కెట్ చేసుకోవలసిన పరిస్థితి నెలకొని ఉంది. చేపలపై ఉన్న జిహ్వాచాపల్యం ముందు అపరిశుభ్ర వాతావరణాన్ని చాలా వరకు వినియోగదారులు పట్టించుకోవడం లేదు. విశాఖ, కాకినాడ ఫిషింగ్ హార్బర్లు, భీమిలి తీరం, గోస్తనీనదిలో చేపలు వేటాడే మెజారిటీ మత్స్యకారులు తమ మత్స్య సంపదను ఇక్కడే విక్రయిస్తుంటారు. సంప్రదాయ మత్స్యకారులు కూడా ఇక్కడే మార్కెట్ చేస్తుంటారు.

వారానికి 30 టన్నులకు పైగా చేపలు..

రోజూ చెరువులు, నదులు, సముద్రంలో పట్టిన 2 టన్నుల వరకు చేపలు, రొయ్యలను స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లో మహిళలు విక్రయిస్తుంటారు. మంగళ, బుధవారాలలో 5 టన్నులు, ఆదివారం 10 టన్నుల వరకు విక్రయాలు జరుగుతాయి. ఇక పండగల సమయంలో వీటి విక్రయాలు రెట్టింపు జరుగుతుంటాయి. ఇదే మార్కెట్‌లో పచ్చి చేపలను ఆనుకుని ఎండు చేపలు విక్రయించే మార్కెట్ కూడా ఉంది. పచ్చి చేపలను నిల్వ చేయడానికి ఎలాంటి సదుపాయాలు ఇక్కడ లేవు. ఆరోగ్యకరమైన వాతావరణం కూడా లేకపోవడంతో ఇక్కడ కొనుగోలు చేసి వినియోగించే చేపల కారణంగా వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్ ఏర్పాటుకు వినతి

ప్రస్తుతం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్‌లను ప్రైవేట్ మార్కెట్‌లో ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. ఈ అవుట్ లెట్ల ద్వారా లైవ్, తాజా మత్స్యరాశులు అందుబాటులో ఉంటున్నాయని అంటున్నారు. లేదా అన్ని వసతులతో ప్రత్యేక చేపల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సాంకేతిక విజ్ఞాన కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పరిశ్రమల నిపుణులు

కొమ్మాది: స్థానిక పరిశ్రమలు, విద్యాలయాలకు మధ్య సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డీఎస్‌టీ) ఏర్పాటు చేసిన సాంకేతిక విజ్ఞాన కేంద్రం (జి–టెక్)ను శుక్రవారం విశాఖ ఉక్కు కర్మాగారం చైర్మన్ అతుల్‌భట్ ప్రారంభించారు. ఉక్కు పరిశ్రమ రంగంలో డిజిటలైజేషన్, ఆటోమేషన్లకు ఇతర దేశాలపై ప్రధానంగా ఆధారపడుతున్నామని, ఈ పరిస్థితి మారి స్వదేశీ పరిజ్ఞానం అభివృద్ధి చేసుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో గీతం అధ్యక్షుడు ఎం. శ్రీ భరత్, వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దవటం, డీఎస్‌టీ శాస్త్రవేత్త డాక్టర్ పి. కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పానిహాతి ఉత్సవం



ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం చేస్తున్న వేద పండితులు

ఆనందపురం : గంభీరం గ్రామంలోని హరేకృష్ణ వైకుంఠ మందిర నిర్మాణ ప్రదేశంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ విశాఖపట్నం విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం పానిహాతి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ నితాయగౌరంగ (శ్రీకృష్ణ బలరాములు) ఉత్సవ విగ్రహాలను మందిర నిర్మాణ ప్రదేశంలో పల్లకిలో ఊరేగించారు. అనంతరం పూజా స్థలం స్థానంలో ఉత్సవ మూర్తులను ఉంచి, వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య వివిధ పండ్ల రసాలు, నది జలాలు, పంచగవ్యాలు, పుష్పాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు సంకీర్తన చేశారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ డాక్టర్ నిష్కించన భక్తదాస మాట్లాడుతూ కలియుగంలో ఐదు వందల ఏళ్ల క్రితం శ్రీ కృష్ణ బలరాములే శ్రీచైతన్య మహా ప్రభు, నిత్యానంద ప్రభువులుగా అవతరించారన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కలకత్తా నగరానికి సమీపంలో గల పానిహతి గ్రామంలో సంకీర్తనలు నిర్వహించి కృష్ణతత్వాన్ని వ్యాప్తి చేశారని వివరించారు. దీంతో అదే రోజున కృష్ణ భక్తులు పానిహతి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా భక్తులు పాలు, అటుకులు, పెరుగు, పంచదార, అరటిపళ్లు, బెల్లంతో తయారు చేసిన ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు. కార్యక్రమంలో యదురాజా దాస, భక్తులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులను పరిశీలించిన డీఈఓ



అనంతవరం హైస్కూల్లో నాడు–నేడు పనులను పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

పద్మనాభం: మండలంలోని మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్షా ఏపీసీ శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. విజయానందపురం, అనంతవరం, గంధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనులను వారు పరిశీలించారు. మండల వనరుల కేంద్రంలోని జేవీకే స్టాక్ పాయింట్‌ను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి ఎం.వి.కృష్ణకుమార్, ఏఈ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

కోరాడలో పైడితల్లమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు

పద్మనాభం: కోరాడలో పైడితల్లమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్ కోరాడ లక్ష్మణరావు తెలిపారు. సోమవారం తొలేళ్ల పండగ నిర్వహిస్తామని, ఉత్సవంలో భాగంగా అమ్మవారి ప్రతిమలను గ్రామంలో ఊరేగిస్తామని తెలియజేశారు. మంగళవారం రథాల ఉత్సవం జరుగుతుందన్నారు. మూడు రథాలను గ్రామంలో ఊరేగిస్తామని తెలిపారు. బుధవారం ముగింపు ఉత్సవం నిర్వహించనున్నామన్నారు.

35 ఏళ్ల అనంతరం..

1988లో పైడితల్లమ్మ ఉత్సవాలు జరిగాయని, మళ్లీ 35 ఏళ్లకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గతంలో పైడి తల్లమ్మ ఆలయం కోరాడ, గెద్దపేట గ్రామాల మధ్య ఉండేదన్నారు. ఇది జీర్ణావస్థకు చేరుకోవడంతో కొత్తగా కోరాడలో పైడితలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఆలయం నిర్మించినట్లు తెలిపారు. కొత్త ఆలయం నిర్మాణంలో భాగంగా పైడి తల్లమ్మ ఉత్సవాలకు శ్రీకారం చుట్టామన్నారు. గత నెల ఏడో తేదీన ఉత్సవాలకు చాటింపు వేశామన్నారు. పైడితల్లమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని బంగారమ్మ, మరిడమ్మ, ముత్యాలమ్మలకు ఇప్పటికే పసుపు కుంకుమలు చెల్లించామని తెలియజేశారు.

జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్ : విశాఖ జిల్లా బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు శుక్రవారం పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే ఈ పోటీల్లో బాలుర విభాగంలో 12 జట్లు, బాలికల విభాగంలో ఆరు జట్లు పాల్గొంటున్నాయి. ఈ పోటీల్లో సత్తాచాటిన బాలబాలికలను జిల్లా జట్లుగా ఎంపిక చేసి ఈనెల 29 నుంచి నూజివీడులో జరిగే అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలకు పంపనున్నారు. ఈ పోటీలను నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమవర్మ ప్రారంభించారు. అతిథిగా సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ హాజరయ్యారు.

దహన ఖర్చులు చెల్లించండి

అల్లిపురం: జీవీఎంసీ రెగ్యులర్ ఉద్యోగులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు తక్షణమే దహన ఖర్చుల నిమిత్తం రూ.25లు చెల్లించేలా జీవీఎంసీ కమిషనర్ సీహెచ్ సాయికాంత్ వర్మ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వీవీ రామారావు, ప్రధాన కార్యదర్శి నరసింగరావు శుక్రవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఉద్యోగి చనిపోయి సంవత్సరం గడిచిపోయినా దహన ఖర్చులు అందక వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులుకు గురయ్యేవారన్నారు. ఈ విషయాన్ని కమిషనర్ సాయికాంత్‌వర్మ దృష్టికి యూనియన్ నాయకులు తీసుకురావటంతో, తక్షణమే స్పందించిన ఆయన హెచ్‌వోడీలకు లక్ష రూపాయలు చొప్పున అడ్వాన్స్ మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చారన్నారు.

హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు 15

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ–చెన్నై ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9, 10 తేదీల్లో నిర్వహించే లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించి ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 15 వరకు ఫీజులు చెల్లించవచ్చని భీమిలి ఆదర్శప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. 16 నుంచి 25 వరకు రూ.10 అపరాధ రుసుముతో ఫీజులు చెల్లించే అవకాశం ఉందన్నారు. లోయర్ పరీక్షలైన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్రభాష, ప్రవేశికలతో పాటు హయ్యర్ పరీక్షలైన రాష్ట్రభాష విశారద పూర్వార్ధ, రాష్ట్రభాష విశారద ఉత్తరార్ధ, రాష్ట్రభాష ప్రవీణ పూర్వార్ధ, రాష్ట్రభాష ప్రవీణ ఉత్తరార్ధ పరీక్షలకు హాజరు కావాలనుకునే వారు 89858 97419 నంబరులో సంప్రదించాలని కోరారు.

సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఫణికుమార్



భీమునిపట్నం: భీమిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎం.ఫణికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన డాక్టర్ కనక దుర్గ ఉద్యోగ విరమణ చేయడంతో ఆ స్థానంలో ఫణికుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రస్తుతం రోగులకు అందిస్తున్న చికిత్సలతో పాటు ఇతర అన్ని వైద్య సదుపాయాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. రాత్రివేళల్లో కూడా వైద్యులు అందుబాటులో ఉంటారని, అత్యవసర వైద్య సేవల కోసం ఏ సమయంలో ఎవరు వచ్చినా వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు. అలాగే మందులకు కొరత లేదని, సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు.

రేపు జగన్నాథ స్వామికి జ్యేష్టాభిషేకాలు

భీమునిపట్నం: భీమిలిలోని జగన్నాథ స్వామి వారి ఆలయం వద్ద ఆదివారం 4వ తేదీన స్వామివారికి జ్యేష్టాభిషేకాలు జరుగుతాయని ఆలయ వంశ పారంపర్య అర్చకులు ఆర్.శింగరాచార్యులు తెలిపారు. ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సాగర్‌నగర్ బీచ్‌లో దుకాణాలు తొలగించాలి

కొమ్మాది: సాగర్‌నగర్ బీచ్ వద్ద అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తక్షణమే తొలగించాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి. రామనరేష్ శుక్రవారం ఆదేశించారు. అటవీశాఖ పరిధిలోకి వచ్చే సాగర్‌నగర్ బీచ్, గుడ్లవానిపాలెం బీచ్‌లను ఇటీవల ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఈ క్రమంలో పర్యాటకుల తాకిడి పెరగడంతో ఇక్కడ అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేశారు. దీనిపై అటవీ శాఖ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు.

నాలుగు వేల మందికి అన్నదానం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ముత్తంశెట్టి మహేష్

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లోని షిర్డీ సాయి, పార్వతీ దేవి ఆలయాల 19వ వార్షికోత్సవం సందర్భంగా నాలుగు వేల మందికి అన్నదానం చేశారు. ఈ అన్న సమారాధనను వైఎస్సార్ సీపీ భీమునిపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఆలయ ధర్మకర్త మొకర అప్పలనాయుడు, కృష్ణాపురం సర్పంచ్ మొకర లక్ష్మీ భవాని తదితరులు పాల్గొన్నారు.

‘వేసవి వెన్నెల’ ప్రారంభం

సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న సూర్యనారాయణ

తగరపువలస: చిట్టివలస సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు మూడు రోజుల పాటు జరగనున్న అవగాహన కార్యక్రమం ‘వేసవి వెన్నెల’ శుక్రవారం ప్రారంభమైంది. సమితి జిల్లా అధ్యక్షుడు నాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రార్థనా శక్తి, నాయకత్వ లక్షణాల గురించి విద్యార్థులకు వివరించారు. సమయపాలన, సానుకూల దృక్పథం అనే అంశాల గురించి వివరించారు. 45 మంది ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్న కార్యక్రమంలో రాష్ట్ర టెక్నో కో–ఆర్డినేటర్ ఎ.రామప్రసాద్, జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త సూర్యనారాయణ, స్టడీ సర్కిల్ జిల్లా ఇన్‌చార్జ్ రవిప్రసాద్, జిల్లా యూత్ కో ఆర్డినేటర్లు సూర్య, మానాపురం సత్యసాయి, సమితి కన్వీనర్ జి.సత్యనారాయణ, విశ్రాంత కన్వీనర్ ఆర్.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఇక ప్రతి పీహెచ్‌సీలో మానసిక వైద్యం



తాళ్లవలస పీహెచ్‌సీలో పేషెంట్లతో మాట్లాడుతున్న మానసిక వైద్యురాలు తేజస్విని

తగరపువలస: దిగులు, మూర్ఛ వ్యాధులు, తనలో తాను మాట్లాడుకోవడం, భయం, నిద్రలేమి, అతి శుభ్రం, మత్తు పదార్థాల వినియోగం తదితర సమస్యలున్న వారిని గుర్తించి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా వైద్యంతో పాటు మందులు అందించనున్నట్టు మానసిక వైద్యురాలు ఎస్.తేజస్విని తెలిపారు. శుక్రవారం ఆమె భీమిలి మండలం తాళ్లవలస పీహెచ్‌సీలో మాట్లాడారు. తాను ప్రతి మొదటి శుక్రవారం ఇక్కడ అందుబాటులో ఉంటానన్నారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ రమేష్ కిషోర్ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ సేవలను మండల ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు, మరో వైద్యుడు ఎంకే సందీప్, ఆరోగ్య విస్తరణ అధికారి రాజ్‌కుమార్, మానసిక ఆరోగ్య సోషల్ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎండల ధాటికి జనం విలవిల



తగరపువలసలో బోసిపోయిన రహదారులు

తగరపువలస: రోహిణి కార్తె ఎండలకు జనం విలవిలలాడిపోతున్నారు. పగలూ, రాత్రి తేడా లేకుండా విసుగెత్తిస్తున్న ఉక్కబోత కారణంగా ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంది. చాలావరకు సమీపంలోని చెట్ల కిందే సేదతీరుతున్నారు. మండుతున్న ఎండల కారణంగా రోడ్లన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయి. మరోకవైపు యువకులు, విద్యార్థులు పగలంతా చెరువులు, నేలబావులు, స్విమ్మింగ్ పూల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. జనసంచారం లేక వ్యాపారాలు మందకొడిగా సాగుతున్నాయి. చాలావరకు దుకాణదారులు ఉదయం 10 గంటల వరకు వ్యాపారాలు తెరచి, తర్వాత మూసేస్తున్నారు. మళ్లీ మధ్యాహ్నం 3గంటల తర్వాత తెరుస్తున్నారు. కొబ్బరి బొండాలు, జ్యూస్‌లు, చెరకు రసం, మజ్జిగ విక్రయాలు మాత్రం జోరుగా సాగుతున్నాయి. రోడ్లపై వివిధ అవసరాల కోసం వచ్చేవారికి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చల్లటి తాగునీరు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ఇంటర్మీడియట్ విద్యాసంస్థలు ప్రారంభించినా, ఎండల దాటికి తాళలేక విద్యార్థు సంఖ్య పలచనగా ఉండగా, మరికొన్ని విద్యాసంస్థలు ఇంకా ప్రారంభించలేదు.

పేదల కోసం ఫుడ్ బ్యాంక్



ఫుడ్ బ్యాంకును ప్రారంభిస్తున్న కైతపల్లి శ్రీనివాసరావు

తగరపువలస: నీడీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో స్థానిక ఆంజనేయస్వామి ఆలయం, వీఎస్ఆర్ కలెక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ఫుడ్ బ్యాంకును భీమిలి సన్ స్కూల్ అధినేత కైతపల్లి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కోసం ఈ ఫుడ్ బ్యాంకును అందుబాటులో ఉంచామన్నారు. వివిధ ఫంక్షన్లలో మిగిలిన ఆహార పదార్థాలను ఈ ఫుడ్ బ్యాంకులో ఉంచుతామని, అవసరమైన వారు ఎవరైనా ఇందులో ఆహార పదార్థాలను తీసుకోవచ్చని తెలిపారు. వెల్ఫేర్ ప్రతినిధి వెంపాడ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆహారం విలువైనదని, తమ ఇళ్లలో జరిగిన శుభకార్యాలయాలలో మిగిలిన ఆహారాన్ని ఈ ఫుడ్ బ్యాంకులో భద్రపరచాలని కోరారు. కార్యక్రమంలో వాండ్రాసి సతీష్, టి.విజయ్, కె.శ్రీను, ఎస్.అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో దోమలకు చెక్



చెత్తసేకరణ, దోమల నివారణ గురించి మహిళలకు వివరిస్తున్న జెడ్సీ రాము

భీమునిపట్నం: దోమల ఉత్పత్తి, వ్యాప్తిని అడ్డుకునేందుకు మహిళలు తగిన జాగ్రత్తలు వహించాలని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము సూచించారు. పరిసరాలను పొడిగా, శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలకు చెక్ పెట్టవచ్చన్నారు. మత్స్యకారులు నివసించే ఎగువపేట ప్రాంతంలో నిర్వహించిన ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటువంటి ప్రాంతాల్లో ఎక్కువ ఇళ్లు పక్కపక్కనే ఉంటాయని, అందువల్ల ప్రత్యేక శ్రద్ధతో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.మూడో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, నూకాలమ్మ వారి ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ వాసుపల్లి కొండబాబు, పారిశుధ్య అధికారి మహాలక్ష్మినాయడు పాల్గొన్నారు.

ఈవోఆర్డీకి ఎంపీడీవోగా పదోన్నతి



పద్మనాభం: పద్మనాభం ఈవోఆర్డీ ఉషారాణికి ఎంపీడీవోగా పదోన్నతి లభించింది. ఆమె డుంబ్రిగుడ ఎంపీడీవోగా నియమితులయ్యారు. ఉషారాణి పద్మనాభంలో ఈవోఆర్డీగా మూడు సంవత్సరాల పది నెలలు విధులు నిర్వహించారు. ఆమె రిలీవ్ కావడంతో పద్మనాభం పంచాయతీ కార్యదర్శి రఘుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ఫుట్‌పాత్ అభివృద్ధి పనులు షురూ

సాక్షి ఎఫెక్ట్..



కారుషెడ్ సమీపంలోని ఫుట్‌ఫుట్‌పాత్‌లపై అమర్చిన సిమెంట్ కాంక్రీట్ పలకలు

పీఎం పాలెం: ‘ప్రమాదకరంగా ఫుట్‌పాత్‌లు ’శీర్షికన సాక్షి దినపత్రికలో గురువారం వెలువడిన వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. ప్రమాదకరంగా ఉన్న చోట్ల సిమెంట్ కాంక్రీట్ పలకల ఏర్పాటు పనులు మొదలు పెట్టారు. క్రికెట్ స్టేడియం కూడలి మొదలుకుని కొమ్మాది కూడలి వరకూ ఫుట్‌పాత్ పొడవునా అవసరం అయిన అన్నిచోట్ల కాంక్రీట్ పలకలు ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

సేవా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు



పిల్లలకు నోట్‌పుస్తకాలు, చాక్లెట్లు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డులో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృతంగా సేవా కార్యక్రమాలు, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. 6వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ చీఫ్ విప్ ముత్తంశెట్టి ప్రియాంక కుమార్తె శివానీ మొదటి పుట్టిన రోజును పురస్కరించుకుని కార్యక్రమాలు నిర్వహించారు. మధురవాడ అమ్మఒడి, అనాథ వీధి బాలల కేంద్రంలో పిల్లల మధ్య కేక్ కట్ చేసి వారికి కేక్, భోజనం, ఇతర తినుబండారాలు, పండ్లు అందజేశారు. ఏఎస్ ఆర్‌నగర్ ఓల్డేజ్ హోమ్‌లో 45మంది వృద్ధులు, మానసిక వికలాంగులు భోజనం ఏర్పాటు చేశారు. మిథిలాపురి ఉడా కాలనీలోని సన్ ఫ్లవర్స్ ఆశ్రమంలో కూడా కేక్ కట్ చేసి, భోజనం ఏర్పాటు చేశారు. కొమ్మాది జంక్షన్‌లోని త్రిశక్తి ఆలయంలో పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, గౌరవాధ్యక్షుడు డాక్టర్ గాదే రోశిరెడ్డి, కనకరాజు, వరలక్ష్మి, జి. సంజీవ్, లోహిత్, సూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వోఎస్ చిన్నారులకు వితరణ

భీమునిపట్నం: శివాని జన్మదినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లోని పిల్లలకు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక నోట్ పుస్తకాలు, స్వీట్లు, చాక్లెటు అందజేశారు. ముందుగా నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలుపల్లి కొండబాబు, మూడో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అల్లిపిల్లి కొండబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు, అనంతరం పిల్లలతో పాటు వారిని చూసుకునే తల్లులకు చీరలను అందించారు. నేరెళ్లవలస వద్దనున్న వృద్ధాశ్రమంలో, తాళ్లవలస వద్దనున్న ‘మన కుటుంబం’ చారిటబుల్ ట్రస్ట్ పిల్లలకు అన్నదానం నిర్వహించారు. నాయకులు కదిరి ఎల్లాజీ, ఎర్నింటి అచ్చిబాబు, వాసుపల్లి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.